క్లుప్తంగా

రామాలయంలో విశేష పూజలు



నాదెండ్ల: గణపవరం గ్రామంలో కొలువై యున్న శ్రీ కోదండ రామాలయంలో గురువారం స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రసన్నాంజనేయ స్వామికి, కోదండరామ స్వామిని పూజారులు అనిల్‌కుమార్‌శర్మ, ఉమామహేశ్వర శర్మలు విశేషంగా అలంకరించారు. పంచామృతాభిషేకాలు, అష్టోత్తర శతనామపూజ చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రావణమాసం ప్రారంభంకానున్న తొలి శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పూజారులు తెలిపారు.

పాఠశాలకు 100 స్టీలు ప్లేట్లు అందజేత



నరసరావుపేట రూరల్: ఉప్పలపాడు జెడ్పీ హైస్కూల్‌కు రూ.5 వేలు విలువైన 100 స్టీల్ ప్లేట్లును దాతలు బహుకరించారు. నరసరావుపేటకు చెందిన కొల్లిపర శ్రీరామకృష్ణ జ్ఞాపకార్థం వారి సతీమణి కోటేశ్వరమ్మ, కుమారులు శ్రీనివాసరావు, సురేష్‌లు స్టీల్‌ప్లేట్లను అందజేశారు. పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో దాతలు ఈ ప్లేటులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.సుందరరావుకు అందించారు. ఈ సందర్భంగా సుందరరావు మాట్లాడుతూ విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి దాతలు అందించిన ప్లేట్లు ఉపయోగపడతాయని తెలిపారు. దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రామిరెడ్డి, వినోద్‌కుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు ఏపీ మధుకుమార్, కె.వి.సుబ్బారెడ్డి, ఎన్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన ఉండాలి

ఎంఈవో శ్రీనివాసరావు

చిలకలూరిపేటటౌన్: వినియోగదారుల హక్కుల రక్షణ చట్టంపై ప్రతి ఒక్క పౌరుడికి, అదేవిధంగా ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాలని ఎంఈవో ఎ.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం తన కార్యాలయంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం రూపొందించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ, 2019 వినియోగ దారుల హక్కుల రక్షణ చట్టం ఎంతో పటిష్టమైనదని, వినియోగదారుడు నష్టపోయినప్పుడు చాలా తక్కువ ఖర్చుతో వినియోగదారుల కోర్టు ద్వారా నష్టపరిహారం పొందవచ్చన్నారు. కల్తీ ఆహారం, తూకాలలో వ్యత్యాసాలు తదితర అంశాలపై ఫోరం సభ్యులు అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ ఫోరం వంటి సంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఈ చట్టం గురించి అవగాహన తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. ఫోరం అధ్యక్షుడు మురికిపూడి ప్రసాద్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి రవినాయక్, కోశాధికారి బేబీ విక్రమ్, కార్యదర్శి గాలయ్య, సహాయ కార్యదర్శి పొన్నం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, బుక్స్ వితరణ



చిలకలూరిపేటటౌన్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అరుదైన చేయూత లభించింది. తెలుగు సొసైటీ ఆఫ్ అమెరికా (చికాగో) వారి సహకారంతో సుమారు 4800 మంది విద్యార్థులకు రూ. 3.63 లక్షల విలువ చేసే భోజన ప్లేట్లు, అలాగే రూ. 2.50 లక్షల విలువ చేసే నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. పట్టణంలోని మండల విద్యావనరుల కేంద్రంలో ఘంటసాల కరిముల్లా సహకారంతో వీటిని అందజేసినట్లు ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. మండలం పరిధిలోని అన్ని పాఠశాలలకు వీటిని అందించనున్నట్లు ఎంఈవో తెలిపారు. తెలుగు సొసైటీ ఆఫ్ అమెరికా, చికాగో సంస్థకు, ఘంటసాల కరిముల్లాకు చిలకలూరిపేట విద్యాశాఖ అధికారులు తరుపున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

నకరికల్లు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 26న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి.కాశయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉదయం 11 గంటలకు విధిగా హాజరుకావాలని సూచించారు.

బస్టాండు ముఖం చూడని బస్సులు

- యడ్లపాడులో పేరుకే బస్టాండ్
- అలంకార ప్రాయంగా ప్రాంగణం
- రూ.లక్షల నిధులు దుర్వినియోగం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ఒక్క బస్సు లోపలకు వచ్చి వెళితే ఒట్టు!



యడ్లపాడులో నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండ్

యడ్లపాడు: మండల కేంద్రంగా ఉన్న యడ్లపాడులో ఆర్టీసీ బస్టాండ్ ఉన్నా, అటు ప్రజలకు ఇటు ఆర్టీసీకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఒక్క బస్సు అక్కడికి రాదు. అలాగని ఒక్క ప్రయాణికుడు అక్కడికి వచ్చేందుకు ఆసక్తి చూపరు. దీంతో లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన బస్టాండ్ పాడుబడిపోయి నిరుపయోగంగా మిగిలిపోతోంది. నిత్యం యడ్లపాడు గ్రామం మీదుగా వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు జరుగుతున్న మండల ప్రజలకు పల్లె వెలుగు సర్వీసులు తప్ప ఇతర సర్వీసులు అందుబాటులో రావడం లేదు.

బస్టాండ్ ఉన్నా.. ప్రయోజనం సున్నా...

బస్టాండ్ ఉన్నా ప్రజలు మాత్రం అక్కడి రాకపోవడంతో డిపో అధికారులు అక్కడికి బస్సుల్ని నిలుపుదల చేయడం మానేశారు. దీంతో యడ్లపాడు గ్రామంలోని రెండు అండర్‌పాస్ వంతెనలకు ఇరువైపులా నాలుగు ప్రదేశాల్లో బస్సుల్ని నిలుపుదల చేస్తున్నారు. ఎండైనా, వానైనా రాత్రి అయినా గంటల కొద్ది ప్రజలు అక్కడే నిలువు కాళ్లపై ఉంటూ బస్సుల కోసం వేచి చూస్తుండటం గమనార్హం. సర్వీసు మార్గంలో బస్సుల్ని ఆపడంతో ట్రాఫిక్ సమస్యతో పాటు వాటి వెనుక వచ్చే వాహనాలకు ఇబ్బందిగా మారుతుంది. దశాబ్దాల కాలం నుంచి మండల ప్రజలను వెంటాడుతున్న ఈ సమస్య పరిష్కారానికి అటు ప్రజాప్రతినిధులు, ఇటు ఆర్టీసీ అధికారులు చొరవ తీసుకోవడం లేదు.

నాలుగుచోట్ల బస్‌స్టాపులు... ఎక్కడా సెల్టర్లు లేవు...

సొలస, లింగారావుపాలెం, మైదవోలు, జాలాది, జగ్గాపురం, గుత్తావారిపాలెం, కారుచోల గ్రామాలకు చెందిన ప్రజలు బస్సులు కోసం ఎక్కువగా యడ్లపాడుకు రావడం జరుగుతుంది. మొదట దింతెనపాడు, తిమ్మాపురం వాసులు తిమ్మాపురం జంక్షన్‌లోనూ, ఉప్పరపాలెం, వంకాయలపాడు వాసులు వంకాయలపాడు వంతెన వద్ద, కొత్తపాలెం, కొండవీడు, కోట, సంతపేట, చెంఘీజ్ ఖాన్‌పేట, సంగంగోపాలపురం, బున్నీనగర్, ఉన్నవ వాసులు బోయపాలెం అండర్‌పాస్ వద్ద బస్సుల్ని ఎక్కేస్తుంటారు. అయితే ఈ నాలుగు గ్రామాల్లోని బస్‌స్టాపుల్లో ఎక్కడా ఎక్కడా ప్రయాణికులు కూర్చొనేందుకు బస్ సెల్టర్లు అందుబాటులో లేవు. యడ్లపాడులో ఒకటి ఉన్నా అది బస్సులు నిలిపేచోటకు దూరంగా ఉన్నందున యాచకులకు ఆవాసంగా మారింది. రోడ్లపై బస్సుల కోసం వేచి ఉండే సమయంలో వృద్ధులు, పిల్లలు ప్రమాదాల బారినపడే అవకాశం ఉంది. ఇప్పటికైనా లక్షలు వెచ్చించిన యడ్లపాడు ఆర్టీసీ బస్టాండ్‌ను ప్రయాణికుల ఉపయోగంలోకి తేవాలి. లేకుంటే ఆర్టీసీ ఆదాయానికి తోడ్పడేలా అద్దెకు ఇవ్వాలని ప్రజలు సూచిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు సమన్వయంతో దశాబ్దాలుగా నెలకొన్న బస్టాండ్, బస్‌సెల్టర్ల సమస్యలకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.

నిర్లక్ష్యంతోనే లక్షల ప్రజాధనం వృథా



అధికారుల నిర్లక్ష్యం వల్లే లక్షలు పెట్టి కట్టించిన బస్టాండ్ అసాంఘిక కార్యక్రమాలకు, యాచకులకు ఆవాసంగా మారింది. ఇప్పటికైనా అధికారులు బస్టాండ్‌ను ఉపయోగంలోకి తీసుకువచ్చే ఆలోచన చేయాలి. వచ్చేనెలలో ఫ్రీబస్సు పథకం అమలైతే రోడ్లపక్క బస్సులెక్కడం కష్టం, ట్రాఫిక్ సమస్య జఠిలం అవుతుంది. అధికారులు చొరవ తీసుకోవాలి. గుంటూరు నుంచి వచ్చే బస్సుల్ని ఎర్రకొండ వద్ద నుంచి వంతెన కిందుగా పోలీస్‌స్టేషన్ వైపు వస్తే బస్టాండ్‌లో ప్రయాణికుల్ని దించి తిరిగి మైదవోలు రోడ్డు వద్ద వంతెన గుండా చిలకలూరిపేట వైపుకు బస్సుల్ని నడపవచ్చు. గ్రామంలో బస్సుల్ని నాలుగు చోట్ల ఆపే ఇబ్బంది పోతుంది.

–నూతలపాటి కాళిదాసు, యడ్లపాడు

అద్దెకు ఇచ్చేందుకు ప్రతిపాదనలు పంపాం



ఆక్రమణలు తీయించాం. అలాగే దీనిని వ్యాపారస్తులకు లీజుకు ఇచ్చే దృష్ట్యా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ఇప్పటికే చాలామంది వ్యాపారులు లీజుకు ఇవ్వాలంటూ వస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల రాగానే టెండర్లు పిలిచి అద్దెకు ఇవ్వడం జరుగుతుంది.

–ఎస్ రాంబాబు, ఆర్టీసీ డిపో మేనేజర్, చిలకలూరిపేట

మానవ అక్రమ రవాణాను అరికడదాం



నరసరావుపేట టౌన్: ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని నరసరావుపేట రైల్వే స్టేషన్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్, ఏఎస్‌ఐ సుభాని మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా ఒక వ్యవస్థీకృత నేరమన్నారు. దాన్ని అరికట్టటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. జీఆర్పీ సిబ్బంది, హనుమంతరావు ఎన్‌ఈఈడీ ఆర్గనైజేషన్ డైరెక్టర్ కె. ప్రేమానందం మరియు కో–ఆర్డినేటర్ రవి కుమార్, సీఎస్‌డబ్ల్యూ ఇజ్రాయేల్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి



శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామం జాతీయ రహదారి మార్గంలో ఈనెల 23న సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇన్నోవా కారు, బైకును ఢీకొన్న ఘటనలో వినుకొండ రూరల్ కుమ్మరిపాలెం గ్రామానికి చెందిన పలుకూరి సుబ్బయ్య తీవ్ర గాయాలు కాగా పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు ప్రవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు తెలిపారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

గుర్రం జాషువాకు ఘననివాళి



వినుకొండ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జాషువాకు నివాళులర్పిస్తున్న నాయకులు



నరసరావుపేట జాషువా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు

వినుకొండ: కవికోకిల, నవయుగ కవిచక్రవర్తి, గుర్రం జాషువా వర్ధంతి కార్యక్రమాలు వినుకొండలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ అధికారప్రతినిధి ఎం.ఎన్.ప్రసాదు ఆధ్వర్యంలో కార్యాలయంలో జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో సాంఘిక దురాచారాలపై తనకవితల ద్వారా మేలుకొల్పిన జాషువా వినుకొండ ప్రాంతవాసి కావడం ఈ ప్రాంతప్రజలు గర్వించాలని అన్నారు. జాషువా ఆశయాలకు అనుగుణంగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిందని గుర్తు చేశారు. అలాగే వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వినుకొండలో క్రైస్తవ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడితే, కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయినత తరువాత క్రైస్తవాస్తులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రధాన సెంటరులో కోట్ల రూపాయలు విలువచేసే భూములు ఆక్రమణకు గురయ్యాయని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అమ్మిరెడ్డి అంజిరెడ్డి, పగడాల వెంకట్రామి రెడ్డి, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ బేతంగా బ్రియేలు, తుమ్మా వెంకటరెడ్డి, రొడ్డా పుల్లారెడ్డి,యారం రామిరెడ్డి, నాగిరెడ్డిలతోపాటు పలువురు పాల్గొన్నారు.

జాషువా సమాఖ్య ఆధ్వర్యంలో..

గుర్రం జాషువా సమాఖ్య ఆవర్యంలో కమిటీ సభ్యులు జాషువా కళాప్రాంగణం వద్ద జాషువా విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా ఇవాళులర్పించారు. కార్యక్రమంలో సి.హెచ్.జాన్‌సుందరరాజు, బి.రవికుమార్, పిడుగు విజయ్, కమాలారామ్‌లతోపాటు పలువురు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

పార్టీనాయకులు కట్టాసుబ్బారావు, గొడవర్తి సుజాత, జాన్‌బాబు, మేడం రమేష్‌లతోపాటు పలువురు నాయకులు జాషువా విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..


కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోయపాటి రామాంజనేయులు తోపాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు జాషువా విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అలాగేపలు స్వచ్ఛంద సేవాసంస్థలు కళాకారులు నివాళులర్పించారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట: కవి కోకిల, మొగలి చక్రవర్తి బిరుదాంకితుడైన మహాకవి గుర్రపు జాషువా వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి (ఎంఆర్‌పీఎస్‌ఎస్) జిల్లా అధ్యక్షులు చింతిరాల మీరయ్య మాదిగ ఆధ్వర్యంలో పల్నాడు రోడ్డులోని ప్రభుత్వాసుపత్రి ఎదురుగా ఉన్న జాషువా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కవిత్వాన్ని ఆయుధంగా చేసుకొని అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. జి.అనిల్‌కుమార్, బండారు సుధాకర్, జి.ప్రశాంతి, కె పరువయ్య పాల్గొన్నారు.

వినుకొండ ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం

- ప్రయాణికులకు సమాచారం లేకుండా సర్వీసు రద్దు
- విశాఖపట్నంకు రిజర్వేషన్ చేయించుకుని బస్టాండ్‌లో ప్రయాణికుల ఎదురుచూపు
- బస్సు రద్దు అయిందని తెలుసుకుని నిరాశగా వెనుదిరిగిన ప్రయాణికులు



రద్దు అయిన విశాఖ బస్సు ఇదే

వినుకొండ: ఆర్టీసీ డిపో అధికారుల నిర్లక్ష్యంతో విశాఖ పట్టణం వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వినుకొండ డిపో నుంచి విశాఖపట్నంకు ప్రతి రోజూ సాయంత్రం 6 గంటలకు బస్సు బయలుదేరుతుంది. అయితే గురువారం సాయంత్రం 6 గంటలకు బస్సు బయలుదేరవలసి ఉంది. విశాఖపట్నం వెళ్లవలసిన ప్రయాణికులు కొందరు ముందుగా రిజర్వేషన్ చేయించుకుని, బస్టాండ్‌కు చేరుకున్నారు. 6 గంటలైన బస్సు ప్లాట్ ఫామ్ మీదకు రాకపోవడంతో, బస్సు రాలేదని ప్రయాణికులు సిబ్బంది ని విచారించగా బస్సు క్యాన్సిల్ అయ్యిందని తెలిపారు. దీంతో ప్రయాణికులు తాము ఎలా ప్రయాణించాలి, బస్సు సర్వీసు రద్దు చేసిన విషయం సమాచారం తెలపరా అని ప్రశ్నించగా 7 గంటలకు ఇతర డిపో బస్సు ఉందని అందులో వెళ్లాలని సలహా ఇచ్చి, ప్రయాణికుల రిజర్వేషన్ టిక్కెట్లు రద్దు చేశారు. దీంతో చేసేది ఏమి లేక కొందరు ప్రయాణం విరమించుకోగా, మరికొందరు ఇతర పట్టణాలకు వెళ్లి అక్కడి నుంచి విశాఖపట్నం బయలుదేరి వెళ్లారు. ఈ సంఘటన పై డిపో మేనేజర్ నాగేశ్వరరావు ను వివరణ కోరగా తాను విధి నిర్వహణలో భాగంగా విజయవాడ మీటింగ్ కు వెళ్లినట్లు, బస్సు క్యాన్సిల్ విషయం తన దృష్టికి రాలేదని... భవిష్యత్తులో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటామని తెలిపారు.

శ్రద్ధగా వింటే ఏ సబ్జెక్టు కష్టం కాదు

సీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో రూ.25 వేల విలువైన సైన్స్, మ్యాథ్స్ కిట్స్



సైన్స్ అండ్ మ్యాథ్స్ కిట్లను పాఠశాలకు అందజేస్తున్న దృశ్యం

యడ్లపాడు: బోధన సమయంలో విద్యార్థులు శ్రద్ధతో వినగలిగినప్పుడు ఏ సబ్జెక్టు అయినా సులభంగా అవగతం చేసుకోవచ్చని హెచ్‌ఎం షేక్ నజీర్ తెలిపారు. లింగారావుపాలెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం సైన్స్ అండ్ మ్యాథ్ కిట్స్ అందజేశారు. విద్యార్థులకు విజ్ఞానశాస్త్రం, గణితం పట్ల ఆసక్తిని పెంపొందించడానికి, ప్రయోగాత్మకంగా నేర్చుకోవడానికి ఈ కిట్లు ఎంతగానో ఉపయోగపడతాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. 'సీడ్స్' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సుమారు రూ. 25 వేల విలువ కలిగిన ఈ కిట్‌లను విద్యార్థులకు అందించడం పట్ల ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నంబూరి నరసింహారావు, తోకల సత్యనారాయణ, సీడ్స్ సంస్థ సభ్యులు షేక్ రసూల్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





నిర్లక్ష్యానికి తుప్పు!

మండల తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న బోర్డు శిథిలావస్థకు చేరింది. ఇనుపరాడ్లతో ఉన్న బోర్డు తుప్పు తిని ఎప్పుడు పడిపోతుందోననేలా ఉంది. రాష్ట్ర పరిపాలనలో కీలకమైన రెవెన్యూ విభాగం పరిస్థితి ఇలా ఉందనేందుకు ఈ నేమ్ బోర్డు ఉదాహరణగా ఉందని స్థానికులు సెటైర్లు వేస్తున్నారు. అధికారులు స్పందించి కొత్త నేమ్ బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

–నాదెండ్ల

కమిటీలతో పార్టీ బలోపేతం చేద్దాం

ఏఐసీసీ సెక్రెటరీ గణేష్ కుమార్ యాదవ్

నరసరావుపేట: జిల్లా వ్యాప్తంగా గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అన్ని రకాల కమిటీలను నియమించి కాంగ్రెస్‌పార్టీ బలోపేతానికి కృషిచేయాలని ఏఐసీసీ సెక్రటరీ గణేష్‌కుమార్ యాదవ్ కోరారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షులు గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన నాయకులు, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి గణేష్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పార్టీ అభివృద్ధిపై తగిన సూచనలు సలహాలను తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ మస్తాన్‌వలి, పీసీసీ సభ్యులు మోహన్‌రెడ్డి, చిలకలూరిపేట, సత్తెనపల్లి, వినుకొండ, పెదకూరపాడు, గురజాల, మాచర్ల అసెంబ్లీల పార్టీ ఇన్‌చార్జీలు ఎం.రాధాకృష్ణమూర్తి, చుక్కా చంద్రపాల్, బోయపాటి రామాంజనేయులు, పమిడి నాగేశ్వరావు, రామచంద్రారెడ్డి, యలమందారెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గంటా గోపి, నాయకులు ఎస్ఎం భాష, ఖాజావలి, కొండలు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరో తరగతి విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్‌లు

నాదెండ్ల: చిరుమామిళ్ళ శ్రీ నడికట్టురామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం డైట్ రిసోర్స్ పర్సన్స్ బాలకోటయ్య, విమలాకుమారి సందర్శించారు. ఆరో తరగతి విద్యార్థుల సామర్థ్యలను పరీక్షించారు. తెలుగు, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో 40 శాతం మంది విద్యార్థులు వెనుకబడి ఉన్నారని, వీరు కనీసం అక్షరాలు గుర్తించలేని స్థితిలో ఉన్నారని గమనించారు. క్రిందిస్థాయి నుండే విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని, లేనిచో వారు పదో తరగతిలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఉపాధ్యాయులకు వివరించారు. జిల్లాలోనే ఈ పాఠశాలకు పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మంచి పేరు ఉందని, ఈ పేరు నిలుపుకునేలా ఉపాధ్యాయులు శ్రద్ధతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీ ఫోర్‌కు సహకారం అందించాలి

- 15,17 వార్డుల్లో వార్డు సభ నిర్వహించిన కలెక్టర్
- పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



మాట్లాడుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు

నరసరావుపేట: ప్రభుత్వ ఆదేశాల మేరకు పీఫోర్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేసి పేదరికం లేని సమాజ స్థాపనకోసం ప్రజలు, ప్రభుత్వం, ప్రైవేటు వ్యక్తులు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వ ఆదేశాల మేరకు పీ–4పై స్థానిక పురపాలక పరిధిలో 15,17 వార్డులలో వార్డుసభను నిర్వహించారు. సభకు ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్, విశిష్ట అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హాజరయ్యారు. జిల్లాలో ఎందరో డబ్బులు ఉన్నవారు, డాక్టర్లు, వ్యాపారులు, ఉద్యోగులు, ఆర్థికంగా స్థిరపడిన వారు, విదేశాలలో ఉంటున్న వారు ఉంటున్నారని, ఇక్కడ ఎమ్మెల్యేగా పనిచేస్తున్న డాక్టర్ చదలవాడ కూడా ఒక డాక్టర్ అని, పీఫోర్ అంటే లేని వ్యక్తికి ఆర్థిక సాయం, రైతులు, పిల్లలకు సహాయం, ఉద్యోగ సాయం ఇలా ఏదైనా సహాయం చేయవచ్చన్నారు. కనీసం మాట సాయమైనా చేయవచ్చునని, గుర్తుపెట్టుకోవాలని సూచించారు. ఆర్డీఓ కె.మధులత, కమీషనర్ ఎం.యశ్వంతరావు, పీఫోర్ విధివిధానాలు, సచివాలయ సిబ్బంది నమోదు వివరాలు తెలియచేస్తూ ఇంకా ఎవరైనా ఉంటే నమోదు చేసుకోవచ్చని అన్నారు. సీపీఓ మూర్తి, తహసీల్దార్ వేణుగోపాలరావు, ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు, ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బెల్లంకొండ: బాల్య వివాహాల పట్ల విద్యార్థులు చిన్నతనం నుంచే అవగాహన కలిగి ఉండాలని చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని చంద్రాజుపాలెంలోని జెడ్పీ హైస్కూల్లో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆడపిల్లలకు 18, మగ పిల్లలకు 21 సంవత్సరాలు నిండకుండా వివాహం చేయకూడదన్నారు. తక్కువ వయసులో వివాహం చేయడం వలన ఆడపిల్లలలో శారీరక, మానసిక ఎదుగుదల లోపించి ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. చిన్న వయసులో గర్భం దాల్చడం వల్ల పుట్టే పిల్లలకు శారీరక వైకల్యం, ఎదుగుదల లేకపోవడం వంటి సమస్యలు వస్తాయన్నారు. స్థానిక ఎస్ఐ డి.ప్రవీణ్ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. మత్తు పదార్థాలు, డ్రగ్స్ వలన కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీ అమ్మవారి పుట్టినరోజు వేడుకలు

నకరికల్లు: మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో వేంచేసి ఉన్న చౌడేశ్వరీ అమ్మవారి పుట్టినరోజు వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు అరిపిరాల సూర్యప్రకాశ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పండ్లతో విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. పలువురు మహిళా భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, సారెను సమర్పించారు. శాకంబరీదేవి అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. భక్త సంఘం ఆధ్వర్యంలో ఆలయంలోని మండపంలో మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.